1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

SHANMUKHAVELUGU

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 03 సంచిక : 151 — సోమవారం 08 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3


Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.




## మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?: ఖర్గే

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 07)

దేశంలో అన్నివర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రధాని మోదీ అసలు ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థులు సహా సమాజంలోని ప్రతి వర్గం ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోతోందని ఆరోపించారు. సమానత్వం, సామాజిక న్యాయం వంటి ప్రాథమిక సూత్రాలను పక్కనపెట్టి దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల కుటుంబాల నెలవారీ ఖర్చులు మరింత అధికమయ్యాయన్నారు. ▶మిగతా 2లో



## ఖర్గేది మిడిమిడి జ్ఞానం: నడ్డా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 07)

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–6 గణాంకాలు.. కేంద్ర వైఫల్యానికి అద్దం పడుతున్నాయంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ఆరోపణలపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖర్గేది మిడిమిడి జ్ఞానమని వ్యాఖ్యానించారు. "రాజకీయ ఆరోపణలకు ప్రజారోగ్యాన్ని కవచంగా వాడుకోవడం మంచిదికాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత ఆరోగ్య వాతావరణంలో వచ్చిన ప్రబలమైన మార్పులకు సర్వే అద్దం పడుతోంది. 2005–06లో వెలువడిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–3తో పోలిస్తే ఇప్పటికి మాతృమూర్తుల ఆరోగ్య సంరక్షణ విషయంలో విస్తృతమైన మార్పు కనిపిస్తోంది. తొలి మూడునెలల్లో గర్భవతుల రిజిస్ట్రేషన్ 43.9% నుంచి 76.2%కి పెరిగింది. ఆసుపత్రుల్లో జరిగే కాన్పులు 38.7% నుంచి 90.6%కి చేరాయి. ఇవి కేవలం గణాంకాలు కావు. ▶మిగతా 2లో

## ఏపీలో రేర్ ఎర్త్ హబ్..



రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

మాస్కోలో రష్యా రేర్ ఎర్త్ సంస్థ 'గిరెడ్‌మెట్'తో మంత్రి నారా లోకేష్ భేటీ

ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదన

నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ల తయారీ కేంద్రంపై చర్చలు

భారత ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లే లక్ష్యంగా ప్రాజెక్టులు


మాస్కోలోని అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన లోకేష్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు.

## నేడు మనం సిద్ధాంతంలో కలుద్దాం!

- చంద్రబాబును చూడాలన్న కామధేనువులంక పెద్దాయన
- వైరల్ అయిన వీడియోకు సీఎం చంద్రబాబు స్పందన
- సత్యనారాయణ .. నేడు కలుద్దాం అంటూ ట్వీట్
- సిద్ధాంతం పర్యటనలో పెద్దాయనను కలవనున్న సీఎం
- సామాన్యుడి కోరికపై ముఖ్యమంత్రి తక్షణ స్పందన





(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడానికి ముందుకొచ్చారు. తనను కలవాలని ఆశగా ఎదురుచూస్తున్న పెద్దాయనను ఉద్దేశించి, "సత్యనారాయణ ..నేడు సిద్ధాంతంలో కలుద్దాం" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే..

ఆంధ్రప్రదేశ్‌లోని కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడితో ఒక యువకుడు మాట్లాడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ▶ 2లో

## ఆపన్నులకు అండగా ఉంటా..



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

తెదేపా కేంద్ర కార్యాలయానికి శనివారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వారి వద్దకు స్వయంగా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారిచ్చిన వినతుల్ని ఆయా శాఖలకు పంపాల్సిందిగా అధికారుల్ని ఆదేశించారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సాయం అందించారు. కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగారు. తన భూమిని ఆక్రమించేందుకు స్థానిక వైకాపా నాయకుడు ప్రయత్నిస్తున్నాడని, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా తనకు న్యాయం చేయడం లేదని శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలానికి చెందిన చెన్నమ్మ వాపోయారు.

వైకాపా ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వేలో తన భూమిని 22ఏలో పెట్టారని కృష్ణా జిల్లా గన్నవరం మండలం గోపవరపుగూడేనికి చెందిన వెంకటరత్నం ఫిర్యాదు చేశారు.

రహదారి ప్రమాదంలో భర్త చనిపోయాడని.. ▶మిగతా 2లో

## గ్రామాల్లో డిజిటల్ సేవలన్నింటికీ ఒకే వేదిక



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

రైతులు, డ్వాక్రా మహిళలు, యువత ఆర్థికంగా ఎదిగిన రోజే దేశం ముందుకు వెళ్తుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన సమృద్ధి కేంద్రాన్ని శనివారం ఆయన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ 'ఒకే వేదిక ద్వారా అన్ని రకాల డిజిటల్ సేవలను అందిస్తూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ కేంద్రాలకు ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన ఈ సమృద్ధి కేంద్రానికి ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తాం. రైతులు పండించిన పంటలు, స్వయం సహాయక బృందాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఈజీ మార్టు ద్వారా దేశంలోని ప్రధాన ప్రాంతాలకు ఈ కేంద్రం ద్వారా ఎగుమతి చేసుకోవచ్చు' అని చెప్పారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. పోస్టల్, ఈ–కామర్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఆధార్ సహా 11 విభాగాల్లో ప్రజలకు ఈ కేంద్రం ద్వారా సేవలు అందించనున్నామన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని నామినేషన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

జనసేన తరఫున రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ శనివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలుచేశారు. రాష్ట్ర శాసనసభ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వనితారాణికి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నుంచి రమేష్ బీ ఫాం అందుకున్నారు. తర్వాత జనసేన, తెదేపా, భాజపా నాయకులతో ▶మిగతా 2లో

## జగన్‌కు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు: మంత్రి నిమ్మల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

వైకాపా అధినేత జగన్‌కు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు మండలంలో రూ.2.35 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ▶ 2లో

## గల్ఫ్ మిత్ర దేశాల కోసం.. ఇరాన్ ఆస్తులపై అమెరికా కన్ను?

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 07)



ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనకపోయినా.. అమెరికా– ఇరాన్ మధ్య పోరుతో గల్ఫ్ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. యుద్ధం కారణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో గల్ఫ్ మిత్రదేశాల పునర్నిర్మాణానికి సాయం అందించాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇరాన్ ఆస్తులను వినియోగించుకోవాలని ▶మిగతా 2లో

## మా కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరగలేరు రామచందర్‌రావు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పొలిమేర దాటనీయమని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు.. భాజపా కార్యకర్తలు తలచుకుంటే మీ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు గ్రామాల్లో తిరగలేరని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"భూములు తీసుకునే రైతులకు పరిహారం ఇవ్వాల్సిందే. రైతులు వ్యతిరేకిస్తున్నా.. కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. రైతులకు పరిహారం ఇచ్చాకే పండ్ల మార్కెట్ పెట్టాలి. కాంగ్రెస్ నేతలు రైతుల భూములు కాజేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ▶మిగతా 2లో



## తెలుగే మన జీవన విధానం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 07)

"అమ్మ భాషను అందరూ ఆదరించాలి. అది మనందరి బాధ్యత. తెలుగే మన జీవన విధానం. నాగరికతకు ప్రతిరూపం. మాతృభాష పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకం" అని రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) ఛాన్స్‌లర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. రాజమహేంద్రవరంలోని జీజీయూ ప్రాంగణంలో చైతన్య సారస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏడో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల తొలిరోజైన శనివారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ ▶మిగతా 2లో

# బద్వేల్ మున్సిపాలిటీలోని 9 వార్డ్ లో డ్రైనేజీ, సిసి రోడ్డు సమస్యను పరిష్కరించాలి

**డీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు కాలనీవాసుల వినతి**



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 7)**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ సందు (ఆంజనేయ నగర్ కొలిమి వీది సందు)లో సెంటర్ డ్రైనేజీ, సిసి రోడ్డు మంజూరు చేయించి, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి క్లాస్‌మేట్ (సహచర విద్యార్థి) అయిన కాలనీ వాసి తులసి వెంకట శివనారాయణ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కాలనీవాసుల విన్నపం పై డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తక్షణమే స్పందించారు. ఆంజనేయ నగర్ కొలిమి వీధి సందులో డ్రైనేజీ, సిసి రోడ్డు ఏర్పాటుకు త్వరలోనే తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తులసి వెంకట శివనారాయణ, దర్శి వెంకటసుబ్బయ్యతో పాటు వడ్లపూడి నాగభూషణం, గోనుగుంట్ల సతీష్, పలువురు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# నూతన అధ్యక్షుడిగా అడ్డగబొట్టు సుబ్బారావు ప్రమాణ స్వీకారం

**జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం**

**చిన్న పత్రికల బలోపేతానికి కృషి చేస్తా**

**సుబ్బారావు**





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)**

ఒంగోలు ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా 'ఉదయ అక్షరం' దినపత్రిక ఎడిటర్ అడ్డగబొట్టు సుబ్బారావు ఎన్నికయ్యారు. ఒంగోలు ఎంసీఏ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా పాటుపడతానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల కుటుంబాల రక్షణకు ప్రభుత్వ తోడ్పాటు తీసుకొస్తానని, చిన్న పత్రికల బలోపేతంలో యూనియన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నూతన అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి. మల్లికార్జున రెడ్డిల పుట్టినరోజు నేడు కావడం, అదే రోజు ఇరువురు పదవులు చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడు అడ్డగబొట్టు సుబ్బారావు (ఉదయ అక్షరం), ఉపాధ్యక్షురాలు టి శైలజ (సూర్య జ్యోతి వార్తలు), ప్రధాన కార్యదర్శి జి మల్లికార్జునరెడ్డి (కలం తీర్పు), కార్యదర్శి ఈర్ల శ్రీనివాసరావు (ఆంధ్ర కలం), కోశాధికారి బి సంజీవరావు (స్వాతి కిరణం), గౌరవాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు.

## మొదటి పేజీ తరువాయి

# ఏపీలో రేర్ ఎర్త్ హబ్..

ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభించే భారీ ఖనిజ వనరులను ఉపయోగించుకుని, ఒక డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. అలాగే, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ ౘ రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు, నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు భాగస్వామ్యం వహించాలని కోరాను" అని తెలిపారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియాన్ని కూడా లోకేష్ సందర్శించారు. ఈ పర్యటన తనకు ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందని, విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా ఈ మ్యూజియం నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

# నేడు మనం సిద్ధాంతంలో కలుద్దాం!

ఆ వీడియోలో, "చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని యువకుడు అడగ్గా, "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేనైతే చూడలేదు" అని పెద్దాయన అమాయకంగా బదులిచ్చారు. "ఆయన్ను కలవాలని ఉందా?" అని అడగ్గా, సత్యనారాయణ ఎంతో ఉత్సాహంగా, చూడాలనే కోరిక ఉందని చెప్పారు. దీంతో ఆ యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట వినగానే సత్యనారాయణ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ హృద్యమైన వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, పెద్దాయన కోరికను మన్నిస్తూ నేరుగా ఆయన్నే కలుస్తానని ప్రకటించారు. సిద్ధాంతంలో తన పర్యటన సందర్భంగా సత్యనారాయణ గారిని కలవనున్నట్లు ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒక సామాన్యుడి కోరికకు ముఖ్యమంత్రి ఇంత త్వరగా స్పందించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆపన్నులకు అండగా ఉంటా..

ఆస్తిలో వాటా ఇవ్వకుండా అత్తమామలు వేధిస్తున్నారని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన ఓ మహిళ విలపించారు. కోర్టు తీర్పు ఇచ్చినా అధికారులు తన భూమి వివరాల్ని ఆన్‌లైన్ చేయకుండా వేధిస్తున్నారని నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలానికి చెందిన సరోజిని ఫిర్యాదు చేశారు.

# మా కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరగలేరు: రామచందర్‌రావు

చేయకుండా వారిని ఇబ్బందులు పెడుతున్నారు. కేంద్రం నుంచి రూ.13లక్షల కోట్లు తెలంగాణకు ఇచ్చాం. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై సచివాలయం వద్ద చర్చకు సిద్ధంగా ఉన్నాం" అని రామచందర్‌రావు అన్నారు.

# మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?: ఖర్గే

సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని, పదవిలో ఆయన్ని కొనసాగించడం లక్షలమంది విద్యార్థులకు అవమానమని కాంగ్రెస్ పేర్కొంది.

# జగన్‌కు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు: మంత్రి నిమ్మల

ఐదేళ్లలో రెండు మూడు డీఎస్సీలు అని చెప్పిన జగన్.. మాట తప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని.. ఐదేళ్లలో ఒక్కటి కూడా విడుదల చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపై చేసి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. డీఎస్సీ నోటిఫికేషన్‌తోపాటు ఉపాధ్యాయ నియామకాలను భర్తీ చేశామన్నారు. డీఎస్సీకి ఎంపికైన ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే అసత్య ప్రచారాలతో వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాముల రజిని కుమార్, ఉన్నమట్ల కబర్ధి, కలిదిండి రామరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని నామినేషన్

కలిసి శాసనసభకు చేరుకుని నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కూటమి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, నక్కా ఆనందబాబు, ఎన్. ఈశ్వరరావులు ప్రతిపాదించారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎంపీలు బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్ తదితరులు లింగమనేనికి అభినందనలు తెలియజేశారు. నామినేషన్ దాఖలు అనంతరం మీడియాతో లింగమనేని రమేష్ మాట్లాడుతూ 'రాజ్యసభ వేదికగా రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాప్రయోజనాల కోసం నిరంతరం కృషిచేస్తాను. పవన్‌కల్యాణ్ నాపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తాను' అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ జనసేన నుంచి రమేష్ రాజ్యసభకు వెళ్లడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మళ్లీ నాయకులంతా అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిశారు.

# తెలుగే మన జీవన విధానం

అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ.. మూడేళ్లుగా తెలుగు మహాసభలు తమ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నామని, తెలుగు, సంస్కృతంలో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ కవులు, కళాకారులను ప్రోత్సహిస్తూ భావితరాలకు భాషా మాధుర్యాన్ని అందించేందుకు ప్రతి జిల్లాలో సభలు నిర్వహిస్తామన్నారు. జులైలో కాకినాడ, ఆగస్టులో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, సెప్టెంబరులో మలేసియాలో సాహిత్య సభలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం అనేక సంస్థలు సాహిత్యంతో వ్యాపారం చేస్తున్నాయని, సభలు ఏర్పాటుచేసినప్పుడు కవులు రిజిస్టర్ చేసుకుంటే రుసుము వసూలు చేస్తున్నాయని, అటువంటి వాటిని బహిష్కరించాలన్నారు. బాల్యంలో తెలుగు ఉపాధ్యాయులు చెప్పిన అనేక అంశాలు ఇప్పటికీ గుర్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు.

# ఖర్గేది మిడిమిడి జ్ఞానం: నడ్డా

ఉత్తమ ఆరోగ్యఫలితాలకు నిదర్శనం" అని నడ్డా పేర్కొన్నారు. అంతకుముందర్ని సర్వే-6 గణాంకాలను ఉటంకిస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. ఆరోగ్యసేవలు, పోషకాహార విషయాల్లో వైఫల్యాలను బహిర్గతంచేసే కీలకమైన డేటాను ప్రభుత్వం దాచిపెట్టిందని విమర్శించారు. "దేశంలో ప్రతి అయిదుగురిలో ఒక చిన్నారి తీవ్రపోషాకాహార లోపంతో బాధపడుతున్నారు. మూడోవంతు పిల్లలు తక్కువ బరువు ఉన్నారు. 6 నుంచి 23 నెలల చిన్నారుల్లో 84%మందికి తగినంత పౌష్టికాహారం లభించడంలేదు. 15-49 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో 57%మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. వీటి నుంచి భాజపా ప్రజల దృష్టి మళ్లిస్తోంది" అని 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

# గల్ఫ్ మిత్ర దేశాల కోసం.. ఇరాన్ ఆస్తులపై అమెరికా కన్ను?

యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

వాటి ప్రకారం.. ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ మిత్రదేశాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒక బృందాన్ని ఆదేశించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆ నష్టాన్ని పూడ్చేందుకు ఇరాన్ ఆస్తులను ఉపయోగించడాన్ని వారు పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ఈ ఆస్తులను భవిష్యత్తు పునర్నిర్మాణం, మరమ్మతుల కోసమే కాకుండా.. ఇప్పటికే భాగస్వాములకు జరిగిన నష్టానికి పరిహారంగా అందించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి. అయితే, ఇరాన్‌కు చెందిన ఏ ఆస్తులను పరిగణనలోనికి తీసుకున్నారనే విషయాన్ని స్పష్టం చేయలేదు. అమెరికా- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. సైనిక ఘర్షణలు మాత్రం ఆగడం లేదు. శాంతి ఒప్పందంపై కూడా అనిశ్చితి నెలకొంది. శాంతి ఒప్పందం కుదరాలంటే.. ముందుగా అమెరికా స్తంభింపజేసిన 24 బిలియన్ డాలర్ల నిధులను వెంటనే విడుదల చేయాలని ఇరాన్ ఇటీవల డిమాండ్ చేసింది. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల పునర్నిర్మాణానికి ఇరాన్ ఆస్తులను ఉపయోగించాలని అమెరికా యోచిస్తోందనే వార్తలు ఏ పరిణామాలకు దారితీస్తాయోనన్న ఆందోళనలు నెలకొన్నాయి.

# సండేస్ ఆన్ సైకిల్

**సైకిల్ తొక్కుదాం... ఆరోగ్యాన్ని పెంపొందిద్దాం**


**కాలుష్యరహిత భవిష్యత్తుకు బాటలు వేద్దాం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)**



ప్రపంచ సైకిల్ దినోత్సవం 2026ను పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ఆర్టీసీ బస్టాండ్, తిరిగి పోలీస్ పెరేడ్ గ్రౌండ్ వరకు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ శారీరక దృఢత్వం, పర్యావరణ సుస్థిరత, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో సైకిల్ ర్యాలీని నిర్వహించామని, ఆధునిక జీవనశైలిలో వాహనాలపై అధికంగా ఆధారపడటం వల్ల వ్యాయామం తగ్గిపోతుందని, దాని ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సైక్లింగ్ అనేది కేవలం వ్యాయామ సాధనం మాత్రమే కాకుండా, ఆరోగ్యాన్ని కాపాడే, కాలుష్యాన్ని తగ్గించే మరియు ఇంధన పొదుపుకు దోహదపడే ఉత్తమ రవాణా మార్గం అన్నారు. రోజూ కొంత సమయం సైక్లింగ్ చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంతో పాటు భవిష్యత్ తరాల కోసం శుభ్రమైన వాతావరణాన్ని కాపాడటానికి కూడా తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రత్యేకించి పోలీసు సిబ్బంది విధుల ఒత్తిడి నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని, క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల శక్తి, స్థైర్యం పెరిగి ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించగలమని అన్నారు. అదే విధంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణారెడ్డి, ఆర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.








# నేడు యర్రగొండపాలెం స్టేషన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 7)**

మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసి అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
08.06.26 సోమవారం


# సమస్యలు ఫుల్ పరిష్కారం నిల్

**నూతన కలెక్టర్ ఆధ్వర్యంలో 12 పిజిఆర్ఎస్‌లు**
**జిల్లా వ్యాప్తంగా 1898 వినతులు**
**పరిష్కారమయినవి 640**
**రెవిన్యూ సమస్యలు 1019**
**పరిష్కారమయినవి 222**
**జిల్లా వ్యాప్తంగా సాధారణ అర్జీల్లో 32 శాతం, రెవిన్యూ సమస్యల్లో 22 శాతం పరిష్కారం**
**ఇదీ నూతన జిల్లా మార్కాపురంలో పిజిఆర్ఎస్ పరిస్థితి**
**సమస్యల పరిష్కారంలో అలసత్వమే తహాశీల్దార్‌ల బదిలీలకు కారణమా?**
**జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైన అర్ధరాత్రి తహశీల్దార్ల బదిలీలు**
**కలెక్టర్ బదిలీల నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 7)

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించే క్రమంలో జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత నిరంతరం కృషి చేస్తున్నారు. అయితే నూతనంగా జిల్లాకు కలెక్టర్‌గా నియమితులైన ఎం విజయసునీత బాధ్యతలు చేపట్టిన నాటి ఆమె ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రాత్రి 10 గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు సుమారు 12 పిజిఆర్ఎస్‌లు నిర్వహించారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమాల్లో 1898 అర్జీలు ప్రజల నుంచి అందాయి. వాటిలో కేవలం 640 అర్జీలు మాత్రమే పరిష్కారమయ్యాయి. అంటే కేవలం 32 శాతం మాత్రమే పరిష్కరించబడ్డాయి. ఇక రెవెన్యూ సమస్యల పరిష్కార విషయానికి వస్తే 1019 అర్జీలు రాగా వాటిలో కేవలం 222 అర్జీలు మాత్రమే పరిష్కరించబడ్డాయి. అంటే కేవలం 22 శాతం మాత్రమే పరిష్కారమయ్యాయి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు ఎంత పని చేసినా కింది స్థాయిలో అధికారుల పనితీరు నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ పరిష్కార శాతం తక్కువలో నమోదు అవుతుంది. వాస్తవానికి ప్రభుత్వం ప్రతి వారం పిజిఆర్ఎస్ నిర్వహిస్తుంది. వచ్చే అర్జీల సంఖ్య పెరుగుతుందే తప్ప పరిష్కారమవుతున్న అర్జీల సంఖ్య మాత్రం 35 శాతానికి మించకపోవడం శోచనీయం. వీటికి తోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నియోజకవర్గ స్థాయి ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నెలకు నాలుగు నిర్వహిస్తున్నారు. వీటిల్లోనూ ప్రతి పిజిఆర్ఎస్ కు 200 కు పైగా అర్జీలు వస్తున్నాయంటే అధికారులు ప్రజల సమస్యల పట్ల ఏ విధంగా పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎంత అధికారుల పై ఒత్తిడి చేస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించినా కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది పని చేస్తున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. అందులో భాగంగానే గత రాత్రి ఆకస్మికంగా జిల్లా వ్యాప్తంగా మార్కాపురం, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని సుమారు 18 మంది తహశీల్దార్లను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత బదిలీ చేశారనే కలెక్టరేట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి గడిచిన ఏడాదిన్నరకు పైగా ప్రతి అధికారి అదే స్థానంలో ఉండడంతో తమను ఎమ్మెల్యేలు, ప్రభుత్వం ఏమీ చేయలదనే ధీమాతో ప్రజల సమస్యలను గాలికి వదిలి వారి జేబులు నిండే పనులను మాత్రం చక్కబెడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నారు. అందులో ప్రథమ భాగంగా కనిగిరి తహశీల్దార్ ఎన్ జయలక్ష్మి ఉన్నారనేది అక్షర సత్యం. గతంలో ఆమె అధికార పార్టీకి చెందిన వికలాంగుల విభాగం టిడిపి అధ్యక్షుడిని స్టేషన్ కు తరలించడం, తనకు నచ్చిన కొంత మంది జర్నలిస్టులకు పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వడం పై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సీరియస్ కూడా అయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే అధిక శాతం మంది తహశీల్దార్లు తమ పని చేయకపోవడంతోనే పిజిఆర్ఎస్ కు వచ్చే అర్జీల పరిష్కారంలో తక్కువ శాతం పరిష్కారమయ్యేయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోనే రెవెన్యూ అధికారులను బదిలీ చేస్తే కొంత మేర అయినా పిజిఆర్ఎస్ అర్జీల్లో కదలికలు వస్తాయనే అలోచనతో జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత తహశీల్దార్ల బదిలీల నిర్ణయం తీసుకుందని ప్రచారం జోరుగా సాగుతుంది. అయితే ఈ బదిలీల పై మాత్రం ఆయా మండల ప్రజలు మాత్రం జిల్లా కలెక్టర్ తీసుకున్న ఆకస్మిక నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తున్నారు. పని చేయని అధికారులకు స్థాన చలనం చేయడం ద్వారా నూతనంగా వచ్చే అధికారులైనా మా సమస్యల పరిష్కరిస్తారేమోనని గంపెడు ఆశతో ఉన్నారు. జిల్లా కలెక్టర్ నిర్ణయం పై ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు....!



# ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 7)

కందుకూరు పట్టణంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రకాశం జిల్లా ఐవీఎఫ్ టీం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు (తరువాయి 4లో...)

# వికసిత్ మార్కాపురం జిల్లా అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**20 సూత్రాల పథకం**
**అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 7)

డబల్ ఇంజన్ ప్రభుత్వ సహకారంతో వికసిత్ మార్కాపురం జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఏపి రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల పథకం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు (తరువాయి 4లో...)

# మాధవ్ రాకతో నూతన ఉత్సాహంలో కమలదళం

**మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షులుగా పివి కృష్ణారావు ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం**
**అధిక సంఖ్యలో పాల్గొన్న బిజెపి నాయకులు కార్యకర్తలు**




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 7)

మార్కాపురం జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిపై కమలాదళం జెండా ఎగరవేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పేర్కొన్నారు. ఆదివారం మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పీవీ కృష్ణారావు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిగా పీవీఎన్ మాధవ్ హాజరయ్యారు. జిల్లా నాయకులకు ఆయన దిశానిర్ధేశం చేయడం కొండంత బలాన్ని ఇచ్చినట్టు చెప్పారు. వెలిగొండ జలాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు,

4

# జిల్లాలో 18 మంది తహశీల్దార్లు బదిలీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 7)

మార్కాపురం జిల్లాలో అకస్మాత్తుగా శనివారం రాత్రి 18 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. కెఆర్ఆర్‌సి తహశీల్దార్‌గా పని చేస్తున్న వి వి నాగరాజు కలెక్టర్ కార్యాలయం కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, యర్రగొండపాలెం తహశీల్దార్‌గా పని చేస్తున్న డి మంజునాథరెడ్డి కలెక్టర్ కార్యాలయం ల్యాండ్స్ 1 సెక్షన్ సూపరింటెండెంట్‌గా, మార్కాపురం ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జి కె అర్జున్‌రెడ్డిని కలెక్టర్ కార్యాలయం ల్యాండ్స్ 2 సెక్షన్ సూపరింటెండెంట్‌గా, పొదిలి తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి మార్కాపురం తహశీల్దార్‌గా, కొనకనమిట్ల తహశీల్దార్ ఏ సురేష్ ను పెద్దారవీడు తహశీల్దార్‌గా, పెద్దారవీడు తహశీల్దార్ కె శిరీష ను తర్లుపాడు



4

# మాధవ్ రాకతో నూతన ఉత్సాహంలో కమలదళం



ఉపాధి అవకాశాల కోసం ఆశగా చూస్తున్న యువతకు, సమగ్ర అభివృద్ధిని కోరుకుంటున్న ప్రజలకు మాధవ్ సందేశం ఒక భరోసాగా నిలిచిందన్నారు ఏలూరి. సారధ్యం నుంచి మనవూరు మనజెండా కార్యక్రమం వరకూ మాధవ్ చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తిగా జిల్లాలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీజేపీ కుటుంబసభ్యుడిపై ఉందన్నారు.. జిల్లాలో అతి ముఖ్యమైన వెలిగొండ ప్రాజెక్టు, జిల్లాలో పరిశ్రమల అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి తగిన కృషి చేస్తామని అన్నారు. అనంతరం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి ఏలూరి రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ మాధవ్ స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి చేర్చుతూ ప్రజలతో మమేకం కావాలని కోరారు. మాధవ్ మాట్లాడిన మాటలు జిల్లా బీజేపీ నాయకుల్లో స్ఫూర్తిని రగిలించాయని, వారి పర్యటన జిల్లా పర్యటన ఎండిన నేలపై కురిసిన తొలి వాన జల్లులా జిల్లా ప్రజల్లో నూతన ఆశలను చిగురింపజేసిందన్నారు. ఆయన రాకతో కమలదళంలో నవచైతన్యం మొదలైందని, ప్రజల్లో అభివృద్ధిపై కొత్త విశ్వాసం మొలకెత్తిందని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమం, సుశాసనం దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో బీజేపీ ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందన్నారు. మార్కాపురం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం బీజేపీ కట్టుబడి ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ నాయకత్వం నిరంతరం కృషి చేస్తోందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. జిల్లా బిజెపి అధ్యక్షులు పివి కృష్ణారావు మాట్లాడుతూ నన్ను నమ్మి ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి పార్టీ బలోపేతానికి అందర్నీ కలుపుకొని పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# వికసిత్ మార్కాపురం జిల్లా అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం


చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వున్న పశ్చిమ ప్రకాశం అనేక దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతంగా వుందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సౌలభ్యం కోసం మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, వై పాలెం నియోజక వర్గాలలో కలిపి మార్కాపురం జిల్లా గా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో దేశంలోనే మార్కాపురం జిల్లా 14 వ స్థానాన్ని ఆక్రమించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కనిగిరి ప్రాంతంలో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో బాల్య దశలోనే వృద్ధాప్య ఛాయలు సంభవిస్తున్నాయని ఆయన అన్నారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని అత్యంత వెనుకబడిన మార్కాపురం జిల్లా కు కృష్ణా జలాలే శరణ్యమని అన్నారు. ఈ ప్రాంత కరవు నివారణకు ఏకైక పరిష్కార మార్గం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి కావడమే తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని ఆయన అన్నారు.అందువల్లనే ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, చిత్త శుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఇటీవల పలు సందర్భాల్లో ప్రాజెక్టు ను సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్నారని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 16 లక్షల మంది ప్రజలకు త్రాగు నీరు లభిస్తుందని ఆయన అన్నారు. మార్కాపురం జిల్లా అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు గురించి, ముఖ్యంగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనుల అవశ్యత గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలసి సమగ్ర నివేదికను అందజేసి, చర్చించినట్లు ఆయన అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే పూర్తి అయినట్లుగా చిత్రీకరించి మరోవైపు జాతికి అంకితం చేసి జగన్మోహన్ రెడ్డి ప్రజలను వంచించారని ఆయన విమర్శించారు. భౌగోళికంగా దొనకొండ, కురిచేడు మండలాలు జిల్లా కేంద్రమైన మార్కాపురం కు చాల దగ్గరగా ఉన్నాయని, కావున ఈ రెండు మండలాలను మార్కాపురం జిల్లాలో విలీనం చేయాలని తాము కూడా కోరుతున్నట్లు ఆయన అన్నారు.నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా ఎంతో చారిత్రాత్మకమైన ప్రాంతంగా ఉందని అన్నారు. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్వీకుల గ్రామం బెస్తవారి పేట మండలం మోక్షగుండం కావడం గర్వకారణం అని అన్నారు. అలాగే కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి గేయాలు రచించిన శ్రీ త్యాగరాజు అర్ధవీడు మండలం కాకర్ల గ్రామం అని అన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండో చెరువు కంభం పట్టణంలో ఉండడం దేశానికి తలమానికమని అన్నారు. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం, త్రిపురాంతకం గ్రామంలో బాల త్రిపుర సుందరి దేవి ఆలయం, దేశంలోనే ప్రసిద్ధి చెందిన నల్లమల అడవుల్లో కొలువైవున్న ఇష్ట కామేశ్వరి దేవస్థానం తదితర ప్రముఖ క్షేత్రాలు మార్కాపురం జిల్లాలో ఉన్నాయని ఏపి రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల పథకం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు.

# జిల్లాలో 18 మంది తహాశీల్దార్లు బదిలీ

తహాశీల్దార్‌గా, మార్కాపురం తహాశీల్దార్ కె చిరంజీవిని పొదిలి తహాశీల్దార్‌గా, పామూరు తహాశీల్దార్ ఏ లక్ష్మీనారాయణ ను కొనకనమిట్ల తహాశీల్దార్‌గా, పామూరు అడహక్ తహాశీల్దార్‌గా ఉన్న ఆర్ వాసుదేవరావును పిసిపల్లి రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్‌గా, తర్లుపాడు అడ్‌హక్ తహాశీల్దార్‌గా పని చేస్తున్న కె కిషోర్ కుమార్ రెడ్డి తర్లుపాడు డిప్యూటీ తహాశీల్దార్‌గా, బేస్తవారిపేట తహాశీల్దార్ గా పని చేస్తున్న ఎ జితేంద్ర కుమార్ ను తిరిగి బేస్తవారిపేట తహాశీల్దార్‌గా, రాచర్ల అడహక్ తహాశీల్దార్‌గా షేక్ రఫి, కంభం ఎంఎల్ఎస్ పాయింట్ డిప్యూటీ తహాశీల్దార్‌గా పని చేస్తున్న యు హర్షవర్ధనాచారి ని సిఎస్‌పురం డిప్యూటీ తహాశీల్దార్‌గా, పొదిలి రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్‌గా పని చేస్తున్న ఎస్ శివ రామ ప్రసన్న ను యర్రగొండపాలెం రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్‌గా, సిఎస్‌పురం తహాశీల్దార్‌గా పని చేస్తున్న కె వి ప్రసాద్ మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, కనిగిరి అడహక్ తహాశీల్దార్ గా పని చేస్తున్న ఎన్ జయలక్ష్మిని యర్రగొండపాలెం తహాశీల్దార్‌గా, వెలిగండ్ల డిప్యూటీ తహాశీల్దార్‌గా పని చేస్తున్న ఎం శ్రీనివాసరావు ను కనిగిరి డిప్యూటీ తహాశీల్దార్‌గా, కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహాశీల్దార్‌గా పని చేస్తున్న డి పార్వతి భాయ్ ను వెలిగండ్ల డిప్యూటీ తహాశీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఐవీఎఫ్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరులో తన విజయంలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో కీలకమైందని, వారికి ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో వ్యాపారులను 'జే ట్యాక్స్' పేరుతో ఇబ్బందులకు గురిచేశారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ పరిపాలన సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయానికి ఆర్యవైశ్యులు విశేషంగా కృషి చేశారని అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, పొట్టి శ్రీరాములు స్మృతివనం పేరుతో 56 అడుగుల కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ గతంలో అనేక ఇబ్బందులు, కేసులను ఎదుర్కొన్నప్పటికీ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేశారని ఎమ్మెల్యే ప్రశంసించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆర్యవైశ్య సమాజానికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తాను ముందుండి సహకరిస్తానని తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తున్న శాసనసభ్యులు నాగేశ్వరరావుకి ధన్యవాదాలు తెలిపారు.. గత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులపై దాడులు జరుగుతున్నాయి అని ప్రశ్నిస్తే కేసులతో తమ గొంతులు నొక్కేసారని కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలందరూ సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కూన శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వర్లు, జలదంకి కృష్ణారావు, బొగ్గవరపు సుబ్బారావు నియోజకవర్గంలో ఆర్యవైశ్య ముఖ్య నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. 3









# ఒంగోలులో ఆపరేషన్ వజ్రప్రహార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా జిల్లా పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఒంగోలు వన్ టౌన్ సిఐ కె వెంకటేశ్వరరావు, ఒంగోలు టు టౌన్ ఎస్ఐ యు పున్నారావు, తాలూకా ఎస్ఐలు మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది ఒంగోలు టూ టౌన్ పియస్ పరిధిలోని బాలాజీ నగర్, బత్తులవారి గుంట, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్' లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. 17 ద్విచక్ర వాహనం, ఒక ఆటో తనిఖీ చేయగా వాటిలో 2 పత్రాలు లేని బైకులు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఒంగోలు వన్ టౌన్ సీఐ కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల బానిసత్వం ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలకు దారితీస్తుందని, మత్తు పదార్థాల విక్రయం, వినియోగం పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా ఓటీపీలు చెప్పమని మోసపూరితంగా డబ్బులు దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆధార్ కార్డులను అపరిచితులకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఆధార్ వివరాలను దుర్వినియోగం చేసి సిమ్ కార్డులు తీసుకుని నేరాలకు పాల్పడే అవకాశముందని తెలిపారు. ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి, మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు లేదా డైల్ 112 లేదా పోలీస్ వాట్సఅప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీలో ఒంగోలు తాలూకా ఎస్ఐ ప్రభాకర్, నాగులుప్పలపాడు ఎస్ఐ మహేంద్ర, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.





## కంభం చెరువు రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

### మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### ఎస్ఐ శివ కృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 7)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం చెరువు రోడ్డులో కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి బ్రెత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి అమాయకుల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో ఇటువంటి తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. మద్యం సేవిస్తే వాహనం నడపవద్దు, మీ ప్రాణం, ఇతరుల ప్రాణం అమూల్యం అని ఎస్ఐ శివ కృష్ణారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గుర్తు తెలియని పాపను ఒంగోలు శిశుగృహంకు చేర్చిన అధికారులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)

ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ ఎండలో ఏడుస్తూ నిస్సహాయ స్థితిలో ఉన్న రెండు సంవత్సరాల పాపాకు ఆశ్రమం కనిపించిన సంతమగులురు పోలీస్ సిబ్బంది, ప్రకాశం జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పి నాగమణి జిల్లా బాలల సంక్షేమ అధికారి పి. దినేష్ కుమార్ హెల్ప్ స్వచ్ఛంద ప్రాజెక్ట్ డైరెక్ట్ బివి సాగర్ జిల్లా బాలల సంక్షేమ అధికారులు చొరవతో పాపకు ఆశ్రమం కల్పిచటము జరిగింది. వివరాలలోకి వెళ్లగా శనివారం మధ్యాహ్నం సంతామగులురు మండలం కొప్పరాము గ్రామంలొ పాప ఒంటరిగా ఉండగా స్థానికులు పాప యొక్క దయానియ పరిస్థితిని గమనించిన స్థానికులు అడగగా, పాప తల్లితండ్రులు పేరులు గాని ఊరుపేరుగని చెప్పలేక పోవడంతో స్థానికులు సంతూమాగులూరు పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. సంతమగులూరు పోలీస్ సిబంది, స్థానికులు పాప యొక్క తల్లితండ్రులు బంధువులు కొరకు కొప్పారాము గ్రామాంలో చుట్టుప్రక్కల గ్రామాలలో నిన్నటి రాత్రి వరకు వెతకటం జరిగింది. కానీ వారి ఆచూకీ తెలియక పోవటం తో పాప పరిస్థిని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్ట్ బివి సాగర్ దృష్టికీ తీసుకొని వెళ్లగా ఈ విషయాన్నీ బివి సాగర్ జిల్లా బాలల సంరక్షణ అధికారి (డిసిపివో) పి దినేష్ కుమార్ దృష్టికి తీసుకొని వెళ్ళాగా వెంటనే స్పందించిన డిసిపిఓ పాపా యొక్క పరిస్థిని ప్రకాశం జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారి పి నాగమణి దృషకి తసుకొనివెళ్లగా వెంటనే పాపకు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ వైద్య పరీక్షలు నిర్వహించాలని డిసిపిఓకు సూచనలు చేశారు. డిసిపీఓ పి దినేష్ కుమార్ పాపకు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో వైద్య పరీక్ష నిర్వహించి డాక్టర్‌లు పాప ఆరోగ్యం బాగుందని తెలిపారు. సంతామగులూరు పోలీస్, కోప్పరేము అంగన్వాడీ కార్యకర్త సిహెచ్ హైమాయమ్మ సహకారంతో జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడే ఒంగోలు రాంనగర్ లోని శిశు గృహంలో చేర్పించడం జరిగింది.

## తర్లుపాడులో ఘనంగా ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం

### శ్రమ తగ్గింది...ఆరోగ్య సమస్యలు పెరిగాయి

### మీ ఆరోగ్యం... మీ చేతిలో...

### ఎస్ఐ బ్రహ్మనాయుడు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 7)

మండల కేంద్రమైన తర్లుపాడులో ప్రపంచ సైక్లింగ్ (డే) దినోత్సవం కార్యక్రమం ఎస్ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఆయనతో పాటు వారి సిబ్బంది కూడా స్వయంగా సైకిళ్లు తొక్కుతూ ప్రపంచ సైక్లింగ్ డే అంటే ఏమిటో ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గత కాలంలో ప్రతి ఒక్కరూ ఎంత దూర ప్రాంతాలైన కాలినడకన లేక సైకిళ్ళ పై ప్రయాణం చేసేవారన్నారు. ఈ విధంగా చేయడంతో శరీరక శ్రమ అధికం కావడంతో శారీరకంగా, మానసికంగా, దృఢత్వం కలిగి వ్యాధి నిరోధక శక్తి అధికంగాఉండేదన్నారు. దీంతో వ్యాధుల బారిన పడేవారు కాదన్నారు. ప్రస్తుత అధునాతన కాలంలో ప్రజలు వివిధ రకాల బైక్, కార్లు, ఇతర వాహనాలను ఉపయోగించి శరీరానికి శ్రమలేని జీవితాన్ని కొనసాగిస్తు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. నేటి యువత కొద్దిపాటి దూరాలకు కూడా వాహనాలను ఉపయోగిస్తు శరీరానికి శ్రమ తగ్గిస్తున్నారన్నారు. కొద్దిపాటి ప్రయాణాలకు కూడా సైకిల్, ప్రయాణం మానవ జీవితంలో మంచి శుభపరిణామమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిక జీవితంలో ప్రతిరోజు సైకిళ్ళను ఉపయోగించడం వలన శారీరక సమస్యలు దూరమవుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ సైకిళ్ల వాడకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

అంతే కాక ఎస్ఐ బ్రహ్మనాయుడు వారి సిబ్బంది సైకిళ్ల పై స్వయంగా తొక్కుకుంటూ, పురవీధులలో పరిసర ప్రాంతాలలో ప్రయాణించడాన్ని యువతకు, ప్రజలకు స్ఫూర్తిదాతగా, ఆదర్శవంతుడిగా ప్రజల హృదయాలను ఆకట్టుకున్నారు. ప్రకృతి ప్రసాదించిన వాతా వరణాన్ని ఆస్వాదిస్తూ, ప్రయాణిస్తూ పర్యావరణాన్ని కూడా కాపాడుకుంటూ, అందరూ సైకిళ్ళ వాడకానికి మరల అలవాటుపడి, మీ ఆరోగ్యం... మీచేతిలో ఉంచుకోవాలని, అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఆయన ప్రజలకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు, పోలీస్ సిబ్బంది శివరాం, రఘు, నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి జెండా ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవన్





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 7)

జిల్లాలోని పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామంలో బిజెపి యువమోర్చా రాష్ట్ర నాయకులు నాయకులు జీవి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కడియం రామయ్య, బత్తుల పాలంకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌లు హాజరై జెండాను ఆవిష్కరించారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుండి బిజెపి నాయకులు కృషి చేయాలని పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. దేశంలో అతిపెద్ద పార్టీగా నిలబడిన భారతీయ జనతా పార్టీ వృక్షానికి కొమ్మలు వలే ఉన్న గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా బిజెపి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.



## యోగా డే కార్యక్రమానికి అందరూ హాజరుకావాలి

(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 7)

ఈ నెల 9న కంభం చెరువు కట్ట పై నిర్వహించే యోగా డే కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పౌరులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కంభం మండల ఎంఈవో అబ్దుల్ సత్తార్ పిలుపునిచ్చారు. ఉదయం 7 గంటల నుండి యోగాడే కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, పలువురు ఉన్నతాధికారులు హాజరుకానున్నారని చెప్పారు. విద్యాశాఖ పక్షాన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఎంఈఓ అబ్దుల్ సత్తార్ కోరారు.

# క్వారీ కుంటలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

## నిర్లక్ష్యానికి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలి - సిపిఎం డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)

ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలెం సమీపంలోని క్వారీ కుంటలో మునిగి మృతి చెందిన నలుగురు చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఘటనపై ఆర్ డిఒ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, తంబి శ్రీనివాసులుతో కలసి మాట్లాడారు. ఈ నెల 4న చెరువుకొమ్ముపాలెం సమీపంలోని క్వారీ కుంటలో ఈతకు వెళ్లిన కరేటి అభిరామ్, కరేటి సుశాంత్, పొదిలి చిన్ను, ఇండ్ల దినేష్ అనే నలుగురు చిన్నారులు ఊబిలో చిక్కుకుని మృతి చెందడం తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. ఘటన స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు. యానాది కాలనీకి కేవలం 100 మీటర్ల దూరంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఎర్రమట్టి తవ్వకాల కారణంగా ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం, పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. గ్రామ సమీపంలో ప్రమాదకరంగా మారిన గుంతల చుట్టూ కనీస రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడం నిర్వాహకుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. దశాబ్దాలుగా ఎర్రమట్టి విక్రయాల




ద్వారా లాభాలు పొందిన నిర్వాహకులు గుంతలను పూడ్చడం లేదా భద్రతా చర్యలు చేపట్టడం వంటి సామాజిక బాధ్యతలను విస్మరించారని ఆరోపించారు. తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చి ఉంటే, తవ్వకాల అనంతరం భద్రతా చర్యలు అమలు చేయించడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా అక్రమ మైనింగ్ జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే ప్రాంతంలో ఎనిమిదేళ్ల క్రితం ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన జరిగినప్పటికీ అధికారులు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలను(అభిరామ్, సుశాంత్ )కోల్పోయిన తల్లి తీవ్ర మానసిక వేదనలో ఉన్నారని, మరో కుటుంబం ఇప్పటికే అనేక కష్టాలు ఎదుర్కొంటోందని తెలిపారు. నిలువనీడ కూడా లేని పరిస్థితుల్లో జీవిస్తున్న కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధిత మూడు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. స్పందన లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జి.రమేష్ మాట్లాడుతూ, ఎర్రమట్టి తవ్వకాల వల్ల ఏర్పడిన గుర్రం చెరువు ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. గతంలో కూడా అక్కడ గేదెలు మృతి చెందిన ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం అరకొరగా ఉన్న కంచె స్థానంలో పూర్తిస్థాయి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నలుగురు చిన్నారుల మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి తగిన నష్టపరిహారం చెల్లించడంతో పాటు, క్వారీ నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన నిర్వాహకులు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# థాంక్యూ ఎమ్మెల్యే సార్...!

### అత్యవసర ఆపరేషన్ కోసం

### ఎల్‌వోసీ ద్వారా రూ.2.5 లక్షలు సాయం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 7)

వలేటివారిపాలెం మండలం కొండసముద్రం గ్రామానికి చెందిన జనిగర్ల నారాయణమ్మకు, ముఖ్యమంత్రి సహాయనిధి పథకం రక్షగా నిలిచింది. పేద వృద్ధురాలైన నారాయణమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో, హాస్పిటల్ లో చూపించుకోగా, గుండెకి సంబంధించి 3 చోట్ల వాల్స్ బ్లాక్ అయ్యాయని డాక్టర్లు చెప్పారు. అర్జెంటుగా గుండె ఆపరేషన్ చేయాలన్నారు. ఆపరేషన్ కు ఆర్థిక సహాయం అందించాలని నారాయణమ్మ కుమారుడు రమేష్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి తక్షణ వైద్య సహాయం కోసం ఎల్‌వోసీ ద్వారా రూ. 2.5 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఆ సహాయంతో రెండు రోజుల క్రితం గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌లో నారాయణమ్మకు బైపాస్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుందని డాక్టర్లు తెలిపారు. తన తల్లి ఆపరేషన్ గురించి చెప్పిన వెంటనే, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పందించి, పెద్ద మనసుతో వెంటనే ఎల్‌వోసీ మంజూరు చేయించారని రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే చేసిన సాయం జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు.

# గిద్దలూరులో బీజేపీ నాయకులతో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ భేటీ



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 7)

మార్కాపురం జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మార్కాపురం పర్యటనలో భాగంగా ఆదివారం గిద్దలూరును సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రాయల్ రిసార్ట్ లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. అనంతరం శ్రీ నెమలిగుండ రంగనాయక స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. తదుపరి మార్కాపురం జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు మార్కాపురం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, నియోజకవర్గ బీఎల్ఓ 1 ఆకుల నాగేష్, పిడతల రమేష్‌రెడ్డి, దూదేకుల బాదుల్లా, కొప్పుల నరసింహులు, స్టేట్ మైనారిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ ఖాదర్ వలీ, గిద్దలూరు సుబ్బారాయుడు, రాచర్ల కాసులు, మహేష్, పుల్లయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, బాదం కిషోర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే కందుల స్వగృహానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 7)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మార్కాపురం పట్టణంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వగృహానికి ఎమ్మెల్యే వారి ఆహ్వానం మేరకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారిరువురి మధ్య రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు బిజెపి నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మార్కాపురం జిల్లా నూతన అధ్యక్షుడుగా పివి కృష్ణారావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సుకుమార భావనల సమాహారం కరుణ శ్రీ కవిత్వం

### టిటిడి ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి

### విద్యార్థులకు విజ్ఞానదాయకంగా శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)




కరుణశ్రీ గా ప్రసిద్ధులైన డాక్టర్ జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన పద్యాలు సుకుమార భావనల సమాహారమని టీటీడీ ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి పేర్కొన్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా కార్యక్రమంలో శాస్త్రి పాల్గొని జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన తెలుగు బాల కవిత లోని విశేషాలను మానవీయ విలువల గురించి విద్యార్థులకు తెలియ చెప్పారు. చిన్న చిన్న పదాలతో పాదాలతో గొప్ప సందేశాన్ని కవిత్వంలో మేళవించి సమాజానికి అందించడంలో పాపయ్య శాస్త్రి సిద్ధహస్తులని శాస్త్రి వెల్లడించారు.

తెలుగు భాషతో పోల్చదగిన తీయనైన భాష ప్రపంచంలో మరొకటి లేదని,. నన్నయ తిక్కన ఎర్రన పోతన శ్రీనాథుడు వంటి మహాకవులతో సాటిరాగలిగిన కవులు ఇతర భాషలలో అంతగా కానరారని తెలుగు తల్లి సాధుజన కల్పవల్లి అని పాపయ్య శాస్త్రి తెలుగు కవుల గొప్పదనాన్ని అపూర్వంగా వెల్లడించారని తెలియజేశారు. తల్లిదండ్రులను దైవాలుగా భావించి గౌరవించి వారి మన్ననలకు పాత్రులయ్యేందుకు బిడ్డలు కృషి చేయాలని పాపయ్య శాస్త్రి ప్రబోధించారని పేర్కొన్నారు. వృక్షం తాను బ్రతికి ఉండగా పదిమందికి నీడనిచ్చి ఆకలికిచ్చేందుకు ఫలాలు ఇచ్చి తాను మరణించిన తర్వాత కూడా కట్టెలుగా ఉపయోగపడు తుందని చెట్టుకు ఉన్న త్యాగ గుణాన్ని మానవులు కూడా ఆదర్శంగా స్వీకరించి పరోపకార గుణంతో ప్రవర్తించాలని పాపయ్య శాస్త్రి చక్కటి సందేశం ఇచ్చారని శాస్త్రి పేర్కొన్నారు. పద్మములోని మకరందాన్ని సువాసనను తేనెటీగ గ్రహించినట్లుగా అదే చెరువులోని కప్ప గ్రహించలేదని మహాకవుల కవిత్వంలోని గొప్పదనాన్ని రీసజ్ఞతను సరస హృదయులు గ్రహించగలిగినట్లుగా మూర్ఖులు గ్రహించలేరని పాపయ్య శాస్త్రి పేర్కొన్నారని వివరించారు. కొన్ని సందర్భాలలో ఉత్తములతోడి సాహచర్యం వల్ల అల్పులు కూడా సామాజిక గౌరవానికి పాత్రులు అవుతారని, అది ఆశ్రయం ఇచ్చిన వారి ఘనత తప్పితే ఆశ్రయించిన వారి ఘనత ఎంత మాత్రం కాదని పేర్కొన్నారని తెలిపారు. కరుణశ్రీ కవిత్వం సుకుమార భావనలకు ప్రతీక అని హృదయ సంస్కారాన్ని పెంపొందించే శక్తి కరుణశ్రీ కవిత్వానికి ఉందని ఎంవిఎస్ శాస్త్రి స్పష్టం చేసారు. కరుణశ్రీ కవిత్వంలోని గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించి చెప్పడంతో పాటు తెలుగు బాల పద్యాలను వారి చేత కంఠస్థం కూడా చేయించారు.

కరుణశ్రీ స్ఫూర్తితో తెలుగు భాష మృతభాష కాకుండా అమృత భాషగా వర్ధిల్లేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవిఎస్ శాస్త్రి కోరారు. ఎస్ పద్మావతి విద్యార్థులకు హనుమాన్ చాలీసా భగవద్గీత శ్లోకాల భావాలను తెలియ చెప్పారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ విద్యార్థులకు నీతి శతకాలతో పాటు వారికి ఉత్తమ సంస్కారం ఆదర్శ భావనలు అలవడేలా జాతి రత్నాలుగా వెలుగొందేలా చేసేందుకు శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులు దోహదం చేస్తాయని విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎస్ఐఆర్ అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 7)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితుల పై పార్టీ బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్య కర్తలకు అవగాహన కల్పించేందుకు నేటి ఉదయం 10గంటలకు చిన్న గంజాం గ్రామంలోని భావన్నారాయణ గుడి ప్రాంగణంలో సర్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కార్యదర్శి అబ్దుల్ కలాం అజాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సదరు సమావేశనికి మండలంలోని బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో 2002, 2006 ఓటర్ల జాబితాలు, విధి విధానాలు, కార్యాచరణ గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొనేవారు మై టీడీపీ యాప్ లో మీ ఫోటోలు అప్ లోడ్ చేయాలని కోరారు.

# యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ విజయ సునీత







(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 7)

యోగాను జీవితం లో భాగం చేసుకోవాలని తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేకూరుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. పెద్దారవీడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యోగాంధ్ర మాస్టర్ శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా అనేది పురాతన పద్ధతని దీని చేయడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం ఏడాది రెండు వారాలపాటు యోగా శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనర్లు ప్రజలందరికీ యోగ యొక్క ప్రాముఖ్యత, గొప్పతనాన్ని తెలియజేసి ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాలోని ప్రజలందరూ దీన్ని ఒక ఉద్యమం లా కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కార్యాలయం ఏవో జాఫర్, ఎంఈఓ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పోతురాజు కాల్వ ఆధునీకరణించి ఆక్రమణలు తొలిగించి పర్యావరణం పరిరక్షణ చేసి నిర్మాణం చేయాలి

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు విజ్ఞప్తి







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)**

పోతురాజు కల్వ ఆధునికరణ సందర్భంగా అక్రమణలలు తొలిగించ కుండ పర్యావరణం పరిరక్షణ నిబంధనలు పాటించకుండ చట్ట విరుద్ధంగా నిర్మాణం చేయడం కరెక్టు కాదు అని ఒంగోలు నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రాబోయే కాలంలో కృష్ణా జిల్లా లో అతి భారీ వర్షాలు కురిసి దాని వలన బుడమేరుకు వరద పోటెత్తి విజయవాడ నగరంలో 16 డివిజన్లులు వర్షాల వలన మునిగిపోయాయి 10 అడుగులు ఎత్తున నీళ్ళు నిలిచాయి గతంలో ఇలాంటి వర్షాలు కురిసి తిరుపతి నగరం మునిగింది. ఒంగోలు నగరంలో కూడ పోతురాజు కాల్వ, నల్ల వాగు వలన 30 కాలనీలు మునిగిన సందర్భం 30 సంవత్సరాల నుంచి. పోతురాజు కాల్వ, నల్లవాగు ఆధునికీకరణ పనులు గత ప్రభుత్వం మొదలు పెట్టి ఏడు సంవత్సరాలు గడుస్తున్నది 45 కోట్లు ఖర్చు అయిన సమస్య పరిష్కారం కాలేదు. అలాగే జమ్ము, చిల్లచెట్టు తీయడం కాంక్రీట్ పనులు చేయడం సాధ్యం కాదు ఆక్రమణలు తీయకుండ ఇరిగేషన్ కాల్వల గట్టు మీద రెండు వైపుల ఆక్రమణలు తొలిగించాలి నిబంధనలు ప్రకారం లేకపోతే 200 కోట్లు ఖర్చు చేసిన ఉపయోగం లేదు. విజయవాడలో బుడమేరు లాగ ఆక్రమణలు లాగా ఆక్రమణలు తొలిగించక పోవడం వలన నగరం 16 డివిజన్‌లు మునిగి పోయిన విధంగా ఒంగోలు నగరం మునిగి పోవడానికి అవకాశం ఉంటుంది. గతంలో రెండు సార్లు మునిగిన సందర్భం ఆక్రమణలు తీయకుండ పనులు మొదలు పెడితే మునిగిపోయే అవకాశం ఉంటుంది. 2018లో పోతురాజు కాల్వ రెండు వైపుల 180 ఇళ్ళు ఉన్నాయి. కానీ 2024 కి షుమారు 800 ఇళ్ళు అయిన్నాయి అని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి.

ఎందుకు అంటే ఎక్కడ కూడ ఆక్రమణలు తొలిగించకుండ ఓట్ల రాజకీయాలు చేయడం వలన నగర ప్రజలు చాల నష్ట పోతారు ఇప్పుడు కూడ రూ.60 నుంచి రూ.70 లక్షలు రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పనులు మొదలు పెట్టారు ముళ్ళు, చెత్త తొలిగిస్తున్నారు అందుకు అభినందనలు కానీ వాళ్ళు పేదలకు, నగర ప్రజలకు ఇబ్బందులు రాకుండ మంచి కోరే వారు అయితే రాబోయే కాలంలో పెద్ద వర్షం వచ్చిన నగరం విజయవాడ, తిరుపతి నగరం మునిగిపోయినట్టు ఒంగోలు నగరం కూడా మునిగి పోకుండా చూడలిసిన భాధ్యత జిల్లా యాత్రంగంది. ఇప్పటికైనా అన్ని విభాగాలు ఇరిగేషన్ , ఆర్ అండ్‌బీ, రేవిన్యూ, నగర టౌన్ ప్లానింగ్ , నగర ప్రణాళిక విభాగం, పర్యావరణ శాఖ, ప్రైవేట్ ఇంజనీర్లు అధికారులతో సమావేశం నిర్వహించ వలసిన అవసరం ఎంతైనా ఉంది . అలాగే నగరం పర్యావరణం దెబ్బతినకుండ చూడవలసిన భాధ్యత ఉంది. రాష్ట్ర, జిల్లా యాంత్రంగానికి ఒక పని జరిగితే నాలుగు రకాలుగా ఉపయోగకం జరగాలి. అందులో రాబోయే కాలంలో నగరంలో నివాసం ఉంటున్న ప్రజలకు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం జరగాలి. దీని వలన చుట్టు ప్రక్కల 30 మురికి వాడల్లో నివాసం ఉంటున్న వారి ఆర్థికాభివృద్ధి పెరిగే విధంగా చూడాలి. అలాగే పర్యావరణం మెరుగు పడాలి, కాల్వలల్లో పేరుకుని ఉన్న ప్లాస్టిక్ లేకుండ చేయ్యాలి రెండు వైపుల రోడ్డు నిర్మాణం చేయడం వలన ఒంగోలు నగరలో ట్రాఫిక్ సమస్య కి పరిష్కారం దొరుకుతుంది పర్యాటక ప్రదేశంగా మార్చవచ్చు. ఒంగోలు నగరంలో వర్షాలు వస్తే నగరం 30 శాతం మునిగి పోతుంది. అతి బారీ వర్షం వస్తే 50 నుంచి 60 శాతం మునిగిపోతుంది గత అనుభవం అందులో 30 కాలనీలు పేదలు నివాసం ఉండే ప్రాంతాలు ఉన్నాయి అలాగే కర్నూలు రోడ్డు ప్రధానమైనది కూడ ముంపు ప్రాంతంగా ఉంది. శంకుస్థాపన జరిగి ఏడు సంవత్సరాలు గడుస్తున్నా 20 శాతం కూడ పనులు జరగలేదు జరిగిన పనులు నాసిరకం ఉన్నాయి. కట్టిన కాంక్రీట్ వాల్ కూలిపోయిన సందర్భం. ఈ అంశం శాసనసభలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రస్తావించరు. అవినీతి జరిగిన దాని మీద విచారణ జరపాలని కోరడం జరిగింది. ఇద్దరూ మంత్రులు నారాయణ, నిమ్మల రామనాయుడు ఒంగోలు వచ్చిన సందర్భంగా పోతురాజు కాల్వ పరిశీలన చేయడం జరిగింది త్వరలో నిధులు మంజూరు చేస్తాం అని చెప్పగం జరిగింది. ఇప్పటికి ఒక్క సంవత్సరం గడిచి పొయింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గోదావరి పుష్కరాలు సందర్భంగా రాజమండ్రి నగరంలో పర్యాటన చేసి పర్యావరణం దెబ్బత్తినకుండా చూడలని ఆదేశాలు ఇచ్చిన విధంగా ఒంగోలు నగరంలో పర్యాటన చేసి ఒంగోలు నగర ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు.

# పర్చూరు తాలుకా ఏపీజిఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 7)**

బాపట్ల జిల్లా కారంచేడు మండలంలోని యార్లగడ్డ వారి కళ్యాణ మండపం నందు ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ ,ప్రధాన కార్యదర్శి కే.రమేష్ కుమార్ ఆదేశాల మేరకు, బాపట్ల జిల్లా ఏపీజీఈఏ బలోపేతానికి, ఉద్యోగుల హక్కుల సాధనకు నియమింపబడిన అడహాక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి, కన్వీనర్ పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్చూరు తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఎన్నకైన సభ్యుల వివరాలు ఇలా.....

ప్రెసిడెంట్ పి వసంత వల్లి, జెనరల్ సెక్రెటరీ కేశిన అంజిబాబు నియమకం జరిగింది. అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ టి అంజలి, 1వ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏమ్ శాలిని, 2వ వైస్ ప్రెసిడెంట్ డి శ్రీనివాసరావు, 3వ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ సి దుర్గారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వి రజిని, 1వ జాయింట్ సెక్రెటరీ బక్క చిన్నసుబ్బారెడ్డి, 2వ జాయింట్ సెక్రెటరీ ఎం అర్ శ్రీలత, 3వ జాయింట్ సెక్రెటరీ వి నాగలక్ష్మి, 4వ జాయింట్ సెక్రెటరీ సిహెచ్ ఎబేల్, ట్రెజరర్ ఎన్ సుబ్బారావులను ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గసభ్యులు మాట్లాడుతూ పర్చూరు తాలుకా ఉద్యోగులు తమ పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిబద్ధతతో పని చేస్తామని తెలిపారు. ఎన్నిక కాబడిన పర్చూరు తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులందరికీ బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అడహాక్ కమిటీ చైర్మన్ జీవివి రాఘవరెడ్డి అభినందనలు తెలిపారు.

# పొదిలి యూనిట్ గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 7)**

పొదిలి పట్టణంలోని ఎన్జీవో హోంలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం పొదిలి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం ఆదివారం ఘనంగా ఏర్పాటు చేశారు. ముందుగా ఇటీవల మరణించిన గాండ్ల తెలికుల సామాజిక సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశం నందు గాండ్ల తెలికుల సంక్షేమ సంఘానికి నిధులతో కూడిన కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పొదిలి పట్టణంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం ప్రతిభవంతులైన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అభినందన సభలో రాష్ట్ర నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసులు, భీమవరపు సహదేవుడు మాట్లాడుతూ మన పిల్లలు ఆర్థికంగా ఎదగాలంటే విద్యలో రాణించాలన్నారు. తల్లిదండ్రులు ప్రోత్సహించి వారి జీవితాలను చక్కదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు స్వర్గీయ గ్రోసు గోపాలయ్య మెమోరియల్ ట్రస్ట్ పేరుతో ఏర్పాటు చేసిన మెమొంటో, శాలువలతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రతిభావంతులైన 12 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు.





# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

## మున్సిపల్ కమీషనర్ శ్రీధర్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 7)**







యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని కనిగిరి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని వైఎస్సార్ రోడ్డులో నిర్వహించిన 'యోగాంధ్ర' ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యువత ప్రతిరోజూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. డీఎల్‌డీఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనశైలికి యోగా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. యోగా సాధన ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. యోగ శిక్షకుడు గురుస్వామి రెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన విధానాలపై పాల్గొన్న వారికి సమగ్ర శిక్షణ అందించారు.యోగా సాధనపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాల సమగ్ర పునఃపరిశీలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 7)** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃపరిశీలన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఓటరు జాబితాల్లో పొరపాట్లు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం 24 ఏళ్ల తర్వాత ఓటరు జాబితాల సమగ్ర పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపడుతోందని పేర్కొన్న ఆయన, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఇది కీలక ప్రక్రియ అని అన్నారు. ఈ నేపథ్యంలో బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. అదే సమయంలో పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా కొనసాగుతుందని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురించబడతాయని, అనంతరం ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని వివరించారు. అందిన అభ్యంతరాలను సెప్టెంబర్ 18లోపు పరిష్కరించి, సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి, వివరాల్లో సవరణలు చేసుకోవాల్సిన వారికి, అర్హత కోల్పోయిన లేదా చెల్లని ఓట్ల తొలగింపునకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమగ్ర పునఃపరిశీలన అనంతరం ప్రతి నియోజకవర్గంలో వేల సంఖ్యలో చెల్లని ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని చెప్పారు. బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చూడాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# దేవరగుడి వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూజలు







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 7)** కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో ఆదివారం మేకల వారి దేవరకొలుపులు సందర్భంగా దేవరగుడి వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులందరిని పేరు పేరునా పలకరించారు. పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఘట్టమనేని సుబ్బారావు, రావూరి రామకోటయ్య, గుత్తా మల్లికార్జున, జిల్లెలమూడి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకర్స్ కోసం ఉచిత వైద్య శిబిరం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 7)** ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆదివారం ఉదయం ఒంగోలు ముంగమూరు రోడ్డు లోని చెన్నకేశవస్వామి లేఔట్ నందు గల ఎన్టీఆర్ పార్కు లో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకర్స్ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది వాకర్స్ పాల్గొని ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ, హెచ్. బి, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, ఆధునిక కంటి పరీక్షలు, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు లాంటి సుమారు ఏడు వేల రూపాయల విలువగల పరీక్షలు ఉచితంగా పొందడం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక నివాసి మరియు సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీ కృష్ణ ప్రారంభించి విద్య వైద్య రంగంలో అనేక విధాలుగా సేవలు చేస్తున్న డాక్టర్ చాపల వంశీ కృష్ణని అభినందించారు. ఈ వైద్య శిబిరం నందు చీఫ్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ,ప్రముఖ జనరల్ మెడిసిన్ అండ్ డయాబెటాలజీ వైద్య నిపుణులు సానల ధీరజ్ బాబు , కంటి వైద్య నిపుణులు డాక్టర్ పురాణం మహిత,రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్ ,అందరినీ పరీక్షించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండ్ల కమ్మ సాహిత్య సమాఖ్య అధ్యక్షులు మండవ సుబ్బా రావు గారు, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ గౌరుబోయిన నాగేశ్వర రావు , రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఈశ్వరయ్య , మేడికొండ మోహన్ రావు గారు, వర్మ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ అధినేత వల్లభుని రంగా రావు , హాస్పిటల్ మేనేజర్ సురేష్ పల్లా , వైద్య సిబ్బంది, వాకర్స్ ,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .







# పొదిలి శ్రీ నటరాజ కూచిపూడి నాట్యాలయం చిన్నారుల శ్రీశైలంలో నాట్య ప్రదర్శన








**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 7)** పొదిలికి చెందిన శ్రీ నటరాజ కూచిపూడి నాట్యాలయంకు చెందిన కూచిపూడి నాట్యాలయం చిన్నారులకు కూచిపూడి నాట్య అధ్యాపకులు కే లక్ష్మి అతి తక్కువ కాలం శిక్షణ తీసుకున్న చిన్నారులు నాట్యాన్ని ప్రదర్శించారు. మొట్టమొదటి సారిగా శ్రీశైల దేవస్థానం ఆస్థాన మండపంలో ఆ పరమేశ్వరుని సన్నిధిలో గజ్జ కట్టి కదం తొక్కారు. నాట్య అధ్యాపకులు కే లక్ష్మి ప్రత్యేక శిక్షణ చిన్నారులకు తక్కువ సమయంలో వేదికపై ప్రదర్శించే అవకాశం కలిగిందనీ పేర్కొన్నారు. చిన్నారులు శ్రీశైల దేవస్థానంలో చక్కటి ప్రతిభను కనబరిచారు. శ్రీశైల దేవస్థానంలో నిత్య కళారాధన కార్యక్రమంలో చిన్నారులు కూచిపూడి ప్రదర్శన చేశారు. నాట్య గురువు కే లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. గరుడ గమన మరియు పుష్పాంజలి మరియు పౌర్ణమి అలాగే సంయుక్త హస్తాలు, శ్లోకాలు వేదికపై పట్టించారు. అదేవిధంగా ఓంకార రూపిని మరియు గురు బ్రహ్మ కూచిపూడి నాట్యాలు అందరిని అలరించాయి. శ్రీశైల దేవస్థానంలో ఇంతటి అవకాశం మాకు రావడం చాలా సంతోషమని నాట్య గురువుకే లక్ష్మి అన్నారు. పొదిలికి చెందిన శ్రీ వాత్సల్య, డి అన్వికరెడ్డి, జె హంసవల్లి పాల్గొన్నారు. అలాగే ఈ భవిత, టీ యశ్విత, ఎం శ్రీహరిణి, యు ధరణి, కే మానస, టి అద్విక, యు నోహిత, టి కుందన, టి అనన్య, అదే విధంగా జింద్రాక్షీ, సిహెచ్ లోహ్య శ్రీ తో పాటు కొంపల్లి బిలవనాథ్ శర్మ, ఆర్ తేజస్విరెడ్డి, జి బిందు ప్రియారెడ్డి, చిలకమర్తి వరలక్ష్మి పాల్గొన్నారు. చిన్నారులు నాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. మాకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన దేవాలయ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కూచిపూడి నాట్యం నేర్చుకోవాలనుకునే వారు 7780698718 నెంబర్‌ను సంప్రదించాలని నాట్య గురువు కే లక్ష్మి తెలిపారు. కూచిపూడి నాట్యాన్ని పలువురు తిలకించారు. కళావేదిక పై జరిగిన కూచిపూడి నాట్య వైభవం అందరిని అలరించింది. కూచిపూడి నాట్యాన్ని ప్రోత్సహించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శ్రీశైల దేవస్థానంలో కలలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, చిన్నారులకు రూము, వసతి, భోజన వసతి ఏర్పాటు చేశారని దైవదర్శనం కూడా కల్పించారని పేర్కొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com